క్లుప్తంగా

సద్వినియోగం చేసుకోండి

రొంపిచెర్ల: సబ్సిడీ గడ్డి విత్తనాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశు వైద్యాధికారి శ్రీధర్ అన్నారు. ఆయన ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని పాడి ఆవులకు గడ్డి కొరత రాకుండా చేసేందుకు మండలానికి 5,500 కిలోల జొన్న విత్తనాలు, 5వేల కిలోల మొక్కజొన్న విత్తనాలు పశు గ్రాసం కోసం పాడి రైతులకు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. విత్తనాలను 75 శాతం సబ్సిడీతో పంపిణీ చేస్తామని అన్నారు. జొన్న విత్తనాలు కిలో రూ.92 ధర ఉండగా సబ్సిడీతో కిలో రూ.23లకే ఇస్తామన్నారు. అలాగే మొక్కజొన్న విత్తనాలు కిలో రూ.68 ఉండగా సబ్సిడీతో రూ17లకే ఇస్తామని తెలిపారు. గడ్డి విత్తనాలను రైతు సహాయ కేంద్రాలకు సోమవారం నుంచి పంపిణీ చేస్తామని తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు పట్టాదారు పాసు పుస్తకం, రేషన్ కార్డు తీసుకుని రావాలన్నారు.

రక్తదాన శిబిరానికి స్పందన

పుంగనూరు: పట్టణంలోని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో 40 మంది రక్తదానం చేశారు. శిబిరాన్ని లయన్స్‌క్లబ్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ డాక్టర్ శివ, అధ్యక్షుడు త్రిమూర్తిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. రెడ్‌క్రాస్ సొసైటీ రక్తం సేకరించారు. చిత్తూరు బ్లడ్‌బ్యాంక్‌కు తరలించి, ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేస్తామని తెలిపారు. తహసీల్దార్ రాము, ఎస్ఐ లోకేష్, ప్రతినిధులు సురేష్, రెడ్డి, రిజ్వి పాల్గొన్నారు.

26న ఇఫ్తార్ విందు

రొంపిచెర్ల: ఈనెల 26న బుధవారం రొంపిచెర్ల మండలంలో రంజాన్ పండుగ సందర్భంగా ముస్లింలకు పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసినట్లు వైఎస్సార్‌సీపీ మైనారిటీ నేత అల్లాబక్ష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రొంపిచెర్ల, ఫజులుపేట, బండకిందపల్లె, పెద్దగొట్టిగల్లు, మల్లెలకస్పా, పాతపేట, గానుగచింత, మోటుమల్లెల నగిరిలోని ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇస్తారని తెలిపారు. ముస్లింలు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు విజయవంతం చేయాలని కోరారు.

గంగజాతర ప్రారంభం



సదుమమ్మ ఆలయంలో భక్తుల సందడి

సదుం: మండలంలో పలు గ్రామాల్లో గంగజాతర ఆదివారం ప్రారంభమైంది. మండల కేంద్రంలోని సదుమమ్మ ఆలయంలో మహిళలు పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించారు. గ్రామ సరిహద్దులోని గంగరాళ్లకు పూజలు నిర్వహించి, అంబలి పంచారు. అర్ధరాత్రి గంగమ్మను ఊరేగింపుగా తీసుకొచ్చి నడివీధిలో ప్రతిష్ఠించారు. పాలమందలో గంగమ్మ, బూరగమందలో నడివీధి గంగమ్మ జాతర సంబరాలు నిర్వహిస్తున్నారు. రెడ్డివారిపల్లెలో చామంతుల ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. జాతరకు బంధువులు, సన్నిహితులు తరలిరావడంతో గ్రామాల్లో జాతర సందడి నెలకొంది.

నేడు బహిరంగ వేలం

గుడుపల్లె: శ్రీ ప్రసన్న రాళ్లగంగమాంబ ఆలయ బ్రహ్మోత్సవాల్లో ఏర్పాటు చేస్తున్న అంగళ్ల గేటు బహిరంగ వేలం పాట సోమవారం ఆలయ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో నిర్వహించే అంగళ్ల గేటు, ఎద్దుల గేటుకు సంబంధించిన వాటికి వేలం నిర్వహిస్తామని నిర్వాహకులు చెప్పారు. ఆసక్తి ఉన్న వారు వేలంలో పాల్గొనాలని కోరారు.

ఎస్సీ వర్గీకరణపై హర్షం



పాలాభిషేకం చేస్తున్న నేతలు

బైరెడ్డిపల్లె: అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణకు ఆమోదం తెలపడంతో ఎమ్మార్పీఎస్ నాయకులు ఆదివారం బైరెడ్డిపల్లె చెక్‌పోస్టు కూడలిలో సంబరాలు జరుపుకున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మందకృష్ణ మాదిగ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఎమ్మార్పీఎస్ నేతలు మల్లికార్జున, ప్రకాష్, శివకుమార్, గిరిబాబు, క్రిష్ణమూర్తి పాల్గొన్నారు.

తెలుగు క్యాలెండర్ల ఆవిష్కరణ



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్మన్

వి.కోట: శ్రీ విశ్వావసు నామ సంవత్సర నూతన తెలుగు క్యాలెండర్లను మండల ప్రబోధసేవా సమితి సభ్యులు ఆదివారం జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రబోధ సేవా సమితి మండల కమిటీ అధ్యక్షుడు అశోక్‌బాబు ఆధ్వర్యంలో మండలంలోని పత్రపల్లి కొత్తూరులోని జెడ్పీ చైర్మన్ క్యాంపు కార్యాలయంలో ఆయన చేతుల మీదుగా ఆవిష్కరించి పంపిణీ ప్రారంభించారు. సభ్యులు విజయ్, హరి, హేమతేజ, గౌతమ్, ఉదయ్ పాల్గొన్నారు.

అందని బిల్లులు..
వెక్కిరిస్తున్న గోడలు



బొమ్మిదొడ్డి లేఔట్‌లో ఆగిన ఇళ్ల నిర్మాణాలు



బొమ్మిదొడ్డి లేఔట్‌లో పూర్తికాని ఇళ్లు

- నియోజకవర్గంలో అసంపూర్తిగా పక్కాగృహాలు
- మంజూరైన ఇళ్లు 13 వేలు
- పూర్తయినవి 9 వేలు
- అయోమయంలో లబ్ధిదారులు

పలమనేరు: సొంతిల్లు కట్టుకోవాలన్నదే ప్రతిపేదవాని కలను నిజంచేస్తూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పలమనేరు నియోజకవర్గంలో నిజం చేసింది. అర్హులైన ప్రతి ఇక్కరికి పక్కా గృహాలను మంజూరు చేయాలనే తలంపుతో నియోజకవర్గంలో 13 వేల ఇళ్లను మంజూరు చేసింది. వీటిలో 9వేల ఇల్లు పూర్తికాగా మిగిలినవి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వివిధ దశల్లో నిర్మాణ పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి. వీటి నిర్మాణాలకు రూ.177 కోట్లను గత ప్రభుత్వం వెచ్చించింది. ఈ ప్రభుత్వంలోనూ ఇళ్ల నిర్మాణాలకు బిల్లులిస్తామని అధికారులు చెబుతున్నా పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. లబ్ధిదారులతో అధికారులు సమావేశాలను నిర్వహించినా ఫలితం కనిపించడం లేదు. దీంతో హౌసింగ్ అధికారులు నిర్మాణాలను ఎలా వేగవంతం చేయాలో అర్థంకావడం లేదు. మరోవైపు క్యాటగిరి–3 కింద మంజూరైన ఇళ్లపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. వాటి నాణ్యతను పరిశీలించాకే కాంట్రాక్టర్లకు బిల్లులు అందిస్తామని హౌసింగ్ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపిన విషయం తెలిసింది. నియోజకవర్గంలో మొత్తం 13వేల ఇళ్లు మంజూరు కాగా వీటిల్లో 9వేల దాకా పూర్తికాగా మిగిలిన 4వేల నిర్మాణాలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన తయారయ్యాయి.

కాలనీల్లోనే ఎక్కువగా...

పట్టణ సమీపంలోని బొమ్మిదొడ్డి కాలనీలో మొత్తం 3,031 ఇళ్లు మంజూరైతే ఇందులో 1,721 ఇళ్లు మాత్రం పూర్తయ్యాయి. మిగిలినవి 1,310 వివిధ దశలో ఉన్నాయి. ఇందులో 14 ఇంకా ప్రారంభానికి నోచుకోలేదు. ఆర్‌బీఎల్‌లో 30, బీఎల్(బిలో లింటర్) 892, ఎల్ఎల్ 48, ఆర్ఎల్(రూఫ్ లెవల్) 195, ఆర్‌సీలో 123 గా వివిధ దశల్లో పనులు ఆగాయి. అదేవిధంగా నియోజకవర్గంలో 12 లేఔట్లున్నాయి. ఈ విషయమై స్థానిక హౌసింగ్ డీఈ దాస్‌ను వివరణ కోరగా డివిజన్ పరిధిలో జూలై నుంచి పక్కాగృహాల నిర్మాణ పనులు వేగంగా సాగనిమాట నిజమేనన్నారు. ఇంటి పనులు చేసిన వారికి బిల్లులిస్తామని లబ్ధిదారులతో అవగాహన సమావేశాలను సైతం నిర్వహించామన్నారు.

ముస్లింల రుణం తీర్చుకోలేం!



ఇఫ్తార్ విందులో తంబళ్లపల్లె ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి, మాజీ ఎంపీ రెడ్డెప్ప, ముస్లిం పెద్దలు

- ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి

పుంగనూరు: ముస్లింలకు ఎంత సేవ చేసినా వారి రుణం తీర్చుకోలేమని తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి తెలిపారు. ఆదివారం రాత్రి పట్టణంలోని అంజుమన్ కమిటీ హాల్‌లో మాజీ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా ఎమ్మెల్యే , మాజీ ఎంపీ రెడ్డెప్ప పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లింలు ఎమ్మెల్యేను సన్మానించారు. ముస్లింలతో ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీకి ముస్లింలు వెన్నెముకగా నిలిచారన్నారు. తమ కుటుంబానికి తొలి నుంచి ముస్లింలు అండగా ఉంటూ, తమ కుటుంబ అభివృద్ధికి ఎంతగానో కృషిచేస్తున్నారని కొనియాడారు. ముస్లింల అభివృద్ధికి తమ కుటుంబం శక్తివంచన లేకుండా సేవ చేస్తుందని తెలిపారు. ఎల్లప్పుడు ముస్లింల ఆశీస్సులు తమ కుటుంబానికి అందించాలని కోరారు. ముతవల్లిలు, అంజుమన్ కమిటీ అధ్యక్షుడు ఎంఎస్. సలీం, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, సీమ జిల్లాల మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఫకృద్దీన్‌షరీఫ్, ముస్లిం పెద్దలు అజీజ్‌సాబ్, బీటీ అతావుల్లా, అయూబ్‌ఖాన్, అమ్ము, కిజర్‌ఖాన్, ఇంతియాజ్, నూరుల్లా, ఖాదర్, నూర్, అయాజ్, అంజాద్ పాల్గొన్నారు.

కార్యకర్తలతో ఎమ్మెల్యే సమీక్ష

పలమనేరు: రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించాలని స్థానిక ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అన్నారు. ఆమేరకు స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ పార్టీ కార్యకర్తల సమావేశాన్ని ఆదివారం ఆయన నిర్వహించారు. స్థానిక ఎన్నికలపై మాట్లాడారు. అనంతరం కార్యకర్తలకు గుర్తింపు కార్డులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన్ను పలమనేరు ప్రింట్ మీడియా వర్కింగ్ జర్నలిస్ట్ సంఘ నేతలు కలిసి సన్మానించారు. ఇంటి పట్టాల విషయంపై వినతిపత్రాన్ని ఇచ్చారు.

కవులకు సన్మానం

పుంగనూరు: ఉగాది పండుగను పురస్కరించుకుని కవులకు, రచయితలకు సన్మాన కార్యక్రమం ఆదివారం సాయంత్రం నిర్వహించారు. పట్టణంలోని రచయితల సంఘ అధ్యక్షుడు నాగరాజ పరాంకుశ ఆధ్వర్యంలో సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ హెచ్ఎం సరస్వతమ్మ, ప్రముఖ ఆర్థోపెడిక్ డాక్టర్ రెడ్డికార్తీక్, న్యాయవాదులు వెంకటపతి, శ్రీనివాసులు, సతీష్‌కుమార్‌రాజు, కవులు హసీనా, జమున, రహత్‌జాన్, హేమలత, స్రవంతి, మురళిలకు సన్మానం చేశారు. పలు కార్యక్రమాలపై చర్చాగోష్టి నిర్వహించారు.

ఉల్లాస్ పరీక్షకు 213 మంది హాజరు



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఏపీఎం సుధారాణి

గుడిపాల: ఉల్లాస్ అక్షరాస్యత అర్హత పరీక్షకు 213 మంది హాజరైనట్లు ఇందిరా క్రాంతి ఏపీఎం సుధారాణి తెలిపారు. మండలంలోని 20 కేంద్రాల్లో ఆదివారం జాతీయ సార్వత్రిక విద్యాపీఠం సహకారంతో వయోజన విద్య ఉల్లాస్ కార్యక్రమంలో నమోదైన వయోజనులకు ఈ పరీక్షను నిర్వహించామన్నారు. మూడు నెలల క్రితం వీరికి పుస్తకాలను అందజేసి నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు తయారు చేసుకొని వారిని తీర్చిదిద్దినట్లు తెలిపారు. అనంతరం 189 కొత్తపల్లెలో జరిగిన పరీక్ష కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఆమెతో పాటు వెలుగు సీసీలు లోకనాథరెడ్డి, సహదేవ్ పాల్గొన్నారు.

టౌన్‌బ్యాంకు సభకు కోరం ఏదీ?



మీడియాతో మాట్లాడుతున్న బ్యాంకు అధికారులు

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరం గిరింపేటలోని ది చిత్తూరు కో–ఆపరేటివ్ టౌన్ బ్యాంక్‌లో ఆదివారం మహాజన సభను నిర్వహించారు. ఖాతాదారులు చాలా మంది ఈ సభకు ముఖం చాటేశారు. 1/3వంతు మంది హాజరు ఉంటేనే సభ నిర్వహించాలి. కానీ ఈ సభకు ఆ సంఖ్యా బలం లేకున్నా అధికారులు కొనసాగించారు. తూతూమంత్రంగా జరిపించారు. నిర్వహణ లోపల కారణంగానే ఖాతాదారులు సభకు రాలేదని పలువురు ఆరోపణలు చేశారు. దీనిపై మీడియా వేసిన ప్రశ్నలకు బ్యాంకు అధికారులు బిక్కమోహం పెట్టారు. సాధారణ సభే కదా, కోరం ఉండాలి కానీ అంటూ గుటకలు మింగారు. ఇప్పుడిప్పుడే బ్యాంకు లాభాల బాటలోకి తీసుకొస్తున్నామని కోరం మాటను దాటవేశారు. తొలుత బ్యాంకు ఓఎస్‌డీ నారాయణమ్మ బ్యాంకు లావాదేవీలను వెల్లడించారు. బ్యాంకు మోసాలను కూడా వివరించారు. సభా ప్రారంభంలో కొంత మంది బ్యాంకు సిబ్బంది జీతాలు లేదని ప్రస్తావనకు తీసుకొచ్చారు. దీనిపై అధికారులు పట్టించుకోకపోవడంపై వారు తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు.

భగత్‌సింగ్‌కు నివాళి

చిత్తూరు కార్పొరేషన్: భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా సీపీఐ నాయకులు నివాళులర్పించారు. నగరంలోని గాంధీ విగ్రహం వద్ద ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. బ్రిటీష్ పాలకులను గడగడ లాడించిన గొప్ప పోరాట యోధుడు భగత్‌సింగ్ అని జిల్లా కార్యదర్శి నాగరాజన్, సహాయ కార్యదర్శి జనార్దన్ తెలిపారు. స్వాతంత్ర్య సాధనలో ప్రముఖ పాత్ర వహించి ప్రాణత్యాగానికి సైతం వెనుకాడని విప్లవ వీరుడని కొనియాడారు. రష్యా విప్లవాన్ని ఆదర్శంగా తీసుకొని అమరజీవి భగత్‌సింగ్ ఆశయసాధనకు ఉద్యమించారన్నారు.

రసాయనిక ఎరువులతో నాశనమే!

- భూసారాన్ని రక్షించుకోకుంటే ముప్పే
- భూముల్లో భారీగా తగ్గిన సేంద్రియ కర్బనం
- ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి పెంచుకోవాలి



మొరంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు

పలమనేరు: రైతన్నలకు తెలీకుండానే భవిష్యత్తులో పెద్ద ఉపద్రవం రానుంది. రైతులు రసాయనిక ఎరువులను విపరీతంగా పొలాలకు వాడి మరో నాలుగైదేళ్లలో సాగు భూములు నిస్సారంగా మారనున్నాయి. పలమనేరు వ్యవసాయశాఖ డివిజన్‌లోని సాగు భూముల్లో నత్రజని(సేంద్రియ కర్బనం) భారీగా తగ్గిందనే చేదు నిజం భూసార పరీక్షల్లో తేటతెల్లమైంది. దీంతో ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులు సేంద్రియ విధానాలను అవలంబించేలా వ్యవసాయశాఖ నడుం బిగించింది. దీనిపై రైతులు కూడా ముందుకు రావాల్సిన అవసరం ఉంది.

సాగుభూముల్లో తగ్గిన సేంద్రియ కర్బనం

పలమనేరు డివిజన్‌లో 64 శాతం మంది ప్రజలకు వ్యవసాయమే జీవనాధారం. ఇప్పటికే పారిశ్రామికీకరణతో గ్లోబల్ వార్మింగ్ భారీగా పెరుగుతోంది. భూమిలోని పోషకాలు, సూక్ష్మధాతువులు తగ్గి పంటలపై పడింది. రైతుకు పంట పండక తగిన ఉత్పత్తులు రావడం లేదు. జిల్లాలో వర్షాధారిత పంటలుగా వేరుశనగ, రాగి, జొన్న, కంది, పప్పుధాన్యాలతో పాటు, నూనె గింజలను రైతులు ఎక్కువగా సాగు చేస్తున్నారు. గత ఏడాది తిరుపతి, కుప్పంలోని ప్రభుత్వ భూసార పరీక్ష కేంద్రాలు జిల్లాలోని పలు మండలాల్లో శ్యాంపిళ్లను రైతుల భూముల నుంచి తీసి భూసార పరీక్షలను చేశారు. వీటి ఫలితాలను చూసిన అధికారులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. మామూలుగా భూమి సారవంతంగా ఉండాలంటే ముఖ్య పోషక పదార్థాలు అయిన నత్రజని, భాస్వరం, పొటాష్ సమ పాళ్లలో ఉండాల్సి ఉంది. అయితే ఇక్కడి భూముల్లో నత్రజని 60 శాతం భూముల్లో తక్కువగానూ, 20 శాతం భూముల్లో మాధ్యమికంగానూ, మూడు శాతం భూముల్లో హెచ్చుగానూ ఉంది. జింకు 1.5 శాతంగా ఉండాలి కానీ జిల్లాలోని భూముల్లో 0.5శాతంగా ఉంది. ఇది తక్కువగా ఉండడం కూడా ఇబ్బందే. ఇక ఉదజని సూచిక పాయింట్ 75గా ఉండాలి కానీ ఇది పెరిగింది. దీంతో భూముల్లో క్షారత పెరిగి భూమి బెట్టను తట్టుకోక పైర్లు త్వరగా ఎండి పంట దిగుబడులు తగ్గుతాయి. లవణ సూచిక 0.25 శాతం లోపల ఉండాలి. కానీ పొలాల్లో 0.40 శాతంగా ఉంది. దీంతో ఫ్లోరైడ్ పెరిగి భూసారాన్ని మొక్క గ్రహించలేని స్థితిలో ఉన్నట్టే.

ప్రకృతి వ్యవసాయమే ప్రత్యామ్నాయం

రానురాను రైతులు రసాయనిక ఎరువుల వాడకం, మోతాదుకు మించిన క్రిమిసంహారక మందులతో భూసారాన్ని కోల్పోయారు. దీంతో మళ్లీ ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి చూపుతున్నారు. దీంతో పంట పెట్టుబడులు పెరిగాయని రైతులు చెబుతున్నారు.

భూములు కాపాడుకోవాలంటే...

- యూరియాను మోతాదుకు మించి పంటలకు వాడరాదు
- పచ్చరొట్ట ఎరువులు వాడాలి
- నేల కోతలను అరికట్టాలి
- భూమిలో తేమ పరిరక్షణకు కృషిచేయాలి
- వర్షపు నీరు పొలాల్లోనే ఇంకేలా చూడాలి
- సేంద్రియ ఎరువులను విరివిగా వాడుకోవాలి
- పంటమార్పిడి కచ్చితంగా పాటించాలి

అవగాహన కల్పిస్తున్నాం

సేంద్రియ వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. చాలామంది రైతులు సహజ పద్ధతుల్లో వ్యవసాయం చేసేందుకు అలవాటు పడుతున్నారు. రసాయనిక ఎరువులను వాడకంతోనే భూములు సారాన్ని కోల్పోయాయి. దీంతో పంటలు సరిగ్గా పండడం లేదు. అందుకే నేచురల్ ఫామింగ్‌పై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం.

సంధ్య,
వ్యవసాయశాఖ ఏఓ, పలమనేరు

ఆలయ అభివృద్ధి కోసం శ్రమదానం



శ్రమదానం చేస్తున్న గ్రామస్తులు



దాతలు సమకూర్చిన నిర్మాణ సామగ్రి

పెద్దపంజాణి: మండలంలోని పురాతన మునీశ్వర స్వామి ఆలయ అభివృద్ధి కోసం నాగిరెడ్డి పంచాయతీ ప్రజలు 300 మంది ఆదివారం శ్రమదానం చేశారు. మండలంలోని నాగిరెడ్డిపల్లి పంచాయతీ సూరకుంట్ల సమీపంలోని కొండపై మునీశ్వరస్వామి ఆలయం ఉంది. ఈ ఆలయం నిత్య పూజలు, అభిషేకాలతో దినదినాభివృద్ధి చెందుతోంది. స్వామివారి దర్శనం కోసం స్థానికులతో పాటు కర్ణాటక, తమిళనాడు నుంచి భక్తులు వస్తుంటారు. ముఖ్యంగా ప్రతి సోమవారం పిల్లలకు పురిటి వెంట్రుకలు తీయించుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు వస్తుంటారు. అదే విధంగా కావడి చెల్లింపులను వేడుకగా నిర్వహిస్తుంటారు. ఆలయానికి రోడ్డు సౌకర్యం లేకపోవడంతో పలువురు దాతలు ఇప్పటికే బండపై మెట్లను చెక్కించారు. మరికొంత మంది దాతలు ఆలయంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు సహాయ సహకారాలు అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో దాతలు సమకూర్చిన ఆలయ నిర్మాణానికి కావాల్సిన సామగ్రిని ఆదివారం గ్రామస్తులు కొండపైకి చేరవేశారు. దీంతో అలయంలో అభివృద్ధి పనులు ముమ్మరమయ్యాయి. శ్రమదానం చేసిన గ్రామస్తులకు ఆలయ కమిటీ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

చెరువు కాలువలను పరిరక్షిద్దాం



రోడ్డు పనులను పరిశీలిస్తున్న జెడ్పీ చైర్మన్

- జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

వి.కోట: మండలంలో కొనసాగుతున్న ఎక్స్‌ప్రెస్ హైవే పనుల్లో భాగంగా చెరువులకు నీరు సాగించే ప్రధాన కాలువలను సైతం నేషనల్ హైవే అథారిటీ వారు పూడ్చి రోడ్లు వేస్తున్నారని చెరువు కాలువలను పరిరక్షించాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు అన్నారు. ఆదివారం మండలంలో కొనసాగుతున్న ఎక్స్‌ప్రెస్ హైవే పనులను జెడ్పీ చైర్మన్ ప్రజాప్రతినిధులు, గ్రామస్తులతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని పైపల్లి చెరువుకు సంబంధించి ప్రధాన కాలువపై ఇప్పుడు ఎక్స్‌ప్రెస్ హైవే రోడ్డు నిర్మాణం జరుగుతోంది. అక్కడ జరుగుతున్న రోడ్డు నిర్మాణంలో మధ్యన పైపల్లి చెరువుకు కాలువ రావాల్సి ఉంది. ఆ కాలువను హైవే అధికారులు ఆక్రమించుకుని కాలువకు అడ్డంగా కట్టడాలు నిర్మిస్తున్నారు. ఈ కాలువ ద్వారానే మండలంలోని పత్రపల్లి, వి.కోట చెరువులకు అనుసంధానమైన పైపల్లి చెరువు కాలువకు అడ్డుకట్ట వేస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకొని కాలువలను పరిరక్షించాలని జిల్లా కలెక్టర్, ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.

వైభవంగా రథోత్సవం



శ్రీనివాసుడి రథాన్ని లాగుతున్న భక్తులు

గుడుపల్లె: మండలంలోని కనమనపల్లె గ్రామంలో ఉన్న శ్రీ పద్మావతీ శ్రీనివాసస్వామి ఆలయంలో రథోత్సవం వైభవంగా జరిగింది. పది రోజులుగా జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రథాన్ని రంగురంగుల వస్త్రాలు పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. శ్రీ పద్మావతీ సమేత శ్రీనివాసస్వామిని పట్టువస్త్రాలతో ప్రత్యేకంగా ముస్తాబు చేసి వేద పండితుల ఆధ్వర్యంలో రథంపై అధిష్ఠింపజేశారు. అనంతరం భక్తులు గోవింద నామస్మరణతో మంగళ వాయిద్యాల నడుమ రథోత్సవాన్ని గ్రామంలోని పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు విశేషంగా తరలివచ్చి స్వామివారిని దర్శనం చేసుకుని రథాన్ని లాగారు. రాత్రి స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేపట్టి, ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు.

గంగమ్మకు మండల పూజలు



అలంకరణలో బోయకొండ గంగమ్మ

పుంగనూరు: మండలంలోని దండుపాళ్యెం గ్రామంలో నూతనంగా నిర్మించిన బోయకొండ గంగమ్మ ఆలయంలో ఆదివారం మండల పూజలు నిర్వహించారు. వేదపండితులు వేకువజాము నుంచి గణపతి, నవగ్రహ, త్రిమూర్తుల, మూలమంత్ర హోమం నిర్వహించి, పూర్ణహుతి కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారి శిలా విగ్రహానికి అభిషేక కార్యక్రమాలు నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ఆరోగ్య సూచనలు తప్పనిసరిగా పాటించాలి



వైద్యపరీక్షలు చేసుకుంటున్న ప్రజలు

చిత్తూరు కలెక్టరేట్ : ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూచనలు తప్పనిసరిగా పాటించాలని యోగాచార్యులు నరేంద్రకుమార్ అన్నారు. నగరంలోని కణ్ణన్ ప్రభుత్వ హైస్కూల్‌లో ఆదివారం సిద్ధ సమాధి యోగా ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైద్యశిబిరానికి విశేష స్పందన లభించిందన్నారు. నగర వాసులకు వైద్య చికిత్సలు చేయించి ఉచితంగా ఆయుర్వేద మాత్రలు పంపిణీ చేసినట్లు తెలిపారు. 100 మందికి ఉచితంగా షుగర్ పరీక్షలు చేయించామన్నారు. ప్రతి ఒక్కరూ ఒత్తిడిని అధిగమించాలంటే యోగా సాధన చేయాలని తెలిపారు. యోగా చేయడం వల్ల అనేక ఉపయోగాలున్నట్లు చెప్పారు. అనంతరం ఆయుర్వేద డాక్టర్ రమేష్‌బాబు, ఇతరులను దుశ్శాలువతో సత్కరించి మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో యోగాచార్యులు బ్రహ్మయ్య, నగరవాసులు పాల్గొన్నారు.